క్లుప్తంగా

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు


ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. మరుగున పడిన ఆలయాన్ని కొన్నేళ్లుగా భక్తులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శుక్రవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహావచనము, వాస్తు పూజ, లలితా సహస్రనామ పారాయణము వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వైబీ డెంటల్ మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సతీష్ సూచించారు. దంతాలు పాడవడానికి కారణాలను వివరించి నోటిని శుభ్రంగా ఉంచుకోవడం కోసం చిట్కాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ఞ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రఘుపతి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఎరువుల కొరత లేదు

వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్


ఎరువుల దుకాణంలో స్టాక్ పరిశీలిస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలంలో ఎరువులకు ఎలాంటి కొరత లేదని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలో గల సొసైటీతో పాటు, పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులు దుకాణాలలో ఎరువుల స్టాక్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం రైతులకు కావాల్సిన ఎరువుల అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. ఎరువుల బస్తాలు అధిక ధరలకు అమ్మితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రక్తదానం చేయండి

మెదక్ మున్సిపాలిటీ: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ప్రాణాలు కాపాడాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మెదక్ ఆర్టీసీ డిపో వద్ద బుధవారం డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాహనదారులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆర్టీసీ ఉద్యోగస్తులు 15 మంది రక్తదానం చేశారు.

మహిళల హక్కులపై అవగాహన

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మంభోజిపల్లిలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం శక్తి జెండర్ స్పెషలిస్టు నాగమణి మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే బేటీ బచావో బేటి పడావోపై అవగాహన కల్పించారు. వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన, మహిళలకు పోక్సో యాక్టు గురించి వివరించారు. కార్యక్రమంలో రమేశ్, పంచాయతీ సెక్రటరీ నగేశ్, మాజీ సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తితో కొలిస్తే పరమాత్మ అనుగ్రహం

రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామి

అల్లాదుర్గం(మెదక్): భక్తి, ప్రేమతో కొలిస్తేనే పరమాత్మ అనుగ్రహం లభిస్తుందని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో ప్రారంభమైన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుడు ఎక్కడో లేడని, మనలోనే ఉన్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ సేవ చేయడం అలవర్చుకోవాలన్నారు. ఎదుటివారిని ప్రేమ, ఆప్యాయతతో పలకరిస్తే, వారు అలాగే వ్యవహరిస్తారని చెప్పారు.

నిర్మించారు.. వదిలేశారు

- ప్రారంభానికి నోచుకోని మోడల్ స్కూల్ హాస్టల్ భవనం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది అధికారుల తీరు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి మోడల్ స్కూల్ హాస్టల్ భవనం నిర్మించారు. కానీ ప్రారంభించడం మరిచారు. ఫలితంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


ప్రారంభానికి సిద్ధంగా ఉన్నమోడల్ స్కూల్ హాస్టల్

రేగోడ్(మెదక్): జిల్లాలోని రేగోడ్ మండల కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి దామోదర రాజనర్సింహ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి రూ. 1 కోటి 28 లక్షలు మంజూరు చేశారు. 2016లో నిర్మాణానికి టెండర్లు కాగా, 2017 నుంచి ఇప్పటివరకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు నత్తనడకన జరిగాయి. ఎట్టకేలకు 15 గదులతో వసతి గృహం నిర్మాణం పూర్తయింది. విద్యార్థినులకు కావాల్సిన వసతులు సైతం ఏర్పాటుచేశారు. అయినా ఎందుకు ప్రారంభించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రేగోడ్ మండలంలో విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల కొరతపై విద్యాశాఖ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి మోడల్ స్కూల్‌కు వచ్చే విద్యార్థినులు రోజూ ఆటోల్లో, బస్సులో వస్తూ అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే హాస్టల్‌ను ప్రారంభించి అడ్మిషన్లు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై సంబంధిత ఏఈ మల్లప్పను బుధవారం వివరణ కోరగా.. హాస్టల్ భవనాన్ని ముస్తాబు చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచామని తెలిపారు. మంజూరైన నిధులతో పనులు పూర్తి చేయించామని, మళ్లీ కావాల్సిన పనులకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

త్వరగా ప్రారంభించాలి



ఆర్.ఇటిక్యాల నుంచి రోజూ బస్సులో మోడల్ స్కూల్‌కు వస్తూ ఇబ్బందులు పడుతున్నాం. త్వరగా వసతి గృహం ప్రారంభించి వసతి కల్పిస్తే ఇక్కడే ఉంటూ చక్కగా చదువుకుంటాం. ఇప్పటికైనా అధికారులు హాస్టల్‌ను ప్రారంభించాలి.

\- పూజ, ఇంటర్ విద్యార్థిని

ప్రారంభానికి సిద్ధంగా ఉంది



వంద మంది బాలికలు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే అవకాశం ఉంది. హాస్టల్‌ను ప్రారంభించాలని ఆదేశాలు ఉన్నాయి. ఎవరైనా హాస్టల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుంటే అడ్మిషన్లు ప్రారంభిస్తాం.

\- ప్రవీణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

సైబర్ మోసగాళ్లతో అప్రమత్తం

ఖాతాదారులకు ఎస్‌ఐ నర్సింహులు సూచన


ఖాతాదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ మోసగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్త పడాలని ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. బుధవారం ఆయన చిలప్‌చెడ్ మండలం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చిట్కుల్ శాఖ ఖాతాదారులకు మేనేజర్ చంపాలాల్ ఆధ్వర్యంలో డిజిటల్ అరెస్ట్ స్కామ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము పలు శాఖల అధికారులమంటూ కాల్ చేసి, పలు నేరాలు చేశారంటూ సైబర్ మోసగాళ్లు బెదిరిస్తున్నారని తెలిపారు. బాధితులను బ్లాక్ మెయిల్ చేసి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతారని పేర్కొన్నారు. బాధితుల నుంచి వచ్చే బెదిరింపు కాల్స్‌కు భయపడకుండా, వెంటనే పోలీసులకు విషయాన్ని తెలపాలని చెప్పారు. కాల్స్‌పై అనుమానం ఉంటే బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సామాజిక తనిఖీ

ఎంపీడీఓ శ్రీనివాస్


కూకుట్లపల్లిలో ఉపాధిహామి గ్రామసభ

కౌడిపల్లి(నర్సాపూర్): పనులలో పారదర్శకత కోసమే ప్రభుత్వం సామాజిక తనిఖీ నిర్వహిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కూకుట్లపల్లి ఏప్రిల్1, 2023 నుంచి 2024 మార్చి వరకు ఉపాధిహామి పథకంలో చేపట్టిన కూలి పనులు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులకు సంబంధించి సుమారు రూ 86లక్షలు ఖర్చుచేశారు. దీనికి సంబంధించి గ్రామంలో డీఆర్‌పీ రాజు సిబ్బంది తనిఖీ చేశారు. దీంతో బుధవారం గ్రామసభను ఏర్పాటు చేయగా.. ఎంపీడీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కూలీలకు పనులు కల్పించడంతో పాటు గ్రామ అవసరాల కోసం ఉపాధిహామి పనులు చేస్తుందన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా పనులలో పారదర్శకత కోసం సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేస్తుందన్నారు. పనులలో అవకతవలకు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ షేక్‌అలీ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

కేంద్ర బృందం సభ్యులు సందీప్, అభిషేక్


క్షయ వ్యాధిపై వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం

అల్లాదుర్గం(మెదక్): ప్రాణాంతకమైన క్షయవ్యాధిని నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం వంద రోజుల క్యాంపు నిర్వహిస్తోంది. అల్లాదుర్గం మండలంలో డిసెంబర్ 7 నుంచి ప్రతి గ్రామంలో క్యాంపు నిర్వహిస్తున్నారు. బుధవారం ముప్పారంలో క్షయ వ్యాధి క్యాంపును కేంద్రం బృందం పరిశీలించింది. గ్రామంలో ఇంటింటికి వెళ్లి బృందం వివరాలు సేకరించడంతో పాటు, రోగులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ సందీప్ చౌహన్, అభిషేక్ మాట్లాడుతూ దేశంలో క్షయ వ్యాధి నిర్మూలనకు క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరికైనా విపరీతమైన దగ్గు వస్తే పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తామన్నారు. క్షయ వ్యాధి నిర్మూలించడమే లక్ష్యమన్నారు. వంద రోజులుగా క్యాంపు నిర్వహిస్తున్నామని, ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు సారిక, సంధ్య, బృందం సభ్యులు రాజేశ్వరి, విష్ణు పాల్గొన్నారు.

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందమైన రంగవల్లుల రూపంలో భద్రతా పరమైన చిత్రాలను వేశారు. రోడ్డు భద్రత, ప్రమాదాలు నివారణలపై పోటీలను సైతం నిర్వహించినట్లు హెచ్‌ఎం నర్సింగం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్)


కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో రంగవల్లులు వేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు


గజగట్లపల్లిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గజగట్లపల్లి, కొర్విపల్లి, సంగాయిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలను అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన విద్యార్థులకు ఉచిత శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలకు చర్యలు చేపట్టిన ఎంఈఓ పుష్పవేణికి హెచ్‌ఎం గాలయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లమ్మ మాతకు బోనాలు


బోనాలతో వెళుతున్న మహిళలు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని శ్రీఎల్లమ్మ మాతకు యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బోనాలు సమర్పించారు. శ్రీమరకత మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం అనంతరం శ్రీఎల్లమ్మమాతకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. బుధవారం ఎల్లమ్మ మాతకు ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న దృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆరునెలల్లోపు చిన్నారులకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని అంగన్‌వాడీ టీచర్లు శశికళ, యాదమ్మ అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన చిన్నారులకు అదనపు ఆహారం ఇవ్వాలని, అంగన్‌వాడీలలో అందించే బాలామృతం ఇవ్వాలని సూచించారు. శిశువులకు సరైన పోషకాహారాలు అందిస్తేనే, వారి ఆరోగ్యం, ఎదుగుదల సక్రమంగా ఉంటుందని చెప్పారు.

నిధుల మంజూరుపై దుష్ప్రచారమా..?

బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ నేతల మండిపాటు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.30 లక్షల నిధులు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి చొరవతో మంజూరైతే, దుబ్బాక ఎమ్మెల్యే మంజూరు చేసినట్లు బీఆర్‌ఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం నార్సింగిలో కాంగ్రెస్ నాయకులు రాజేష్, సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి కోరగా.. మంత్రి కొండా సురేఖ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే ప్రతిపాదనలు పెట్టిన లేఖ ఉంటే చూపాలని బీఆర్‌ఎస్ నాయకులను కోరారు. ఈ పనుల విషయమై కనీసం ఎమ్మెల్యేకు తెలిసి కూడా ఉండదని ఎద్దేవా చేశారు.

జీవన ఎరువుల వాడకంపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని వ్యవసాయ పొలం వద్ద జీవన ఎరువుల వాడకంపై ఏఈఓ విజృంభణ అవగాహన కల్పించారు. బుధవారం నార్సింగి పంట పొలం వద్ద నారు శుద్ధి కోసం జీవన ఎరువు వినియోగంపై వివరించారు. పంట పొలం చిన్న మడి చేసి అందులో 70 శాతం నీటిలో ఒక లీటర్ జీవన ఎరువును వినియోగించాలని సూచించారు. ఈ పొలం మడిలో పీకిన నారును 10 నిమిషాలు వేరు మునిగేలా ఉంచాలన్నారు. దీంతో నారు వృద్ధి అయిన తర్వాత నాటు వేసుకోవాలని సూచించారు. దీంతో నారు శుద్ధి జరిగి రోగ నిరోధక శక్తి పెరుగుతోందని చెప్పారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

సీఐ వెంకట్ రాజాగౌడ్


ఆర్‌పీఎల్ పోటీలు ప్రారంభించిన సీఐ

రామాయంపేట(మెదక్): మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని సీఐ వెంకట్ రాజాగౌడ్ సూచించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో బుధవారం రామాయంపేట ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆర్‌పీఎల్ పోటీలు నిర్వహిస్తుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాగా, సీఐ కొద్దిసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, ఆర్‌పీఎల్ నిర్వాహకులు బసన్నపల్లి మల్లేశం, ఉమామహేశ్, ఆర్కేమల్లేశం, సుభాశ్, రాజు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం(మెదక్): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో జిల్లా స్థాయి గణేశ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినా, గెలిచిన స్నేహభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనుంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ హోం ఎదుట ఆందోళన

సరైన వైద్యం అందక రోగి మృతి చెందాడని ఆరోపణ


నర్సింగ్ హోం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): సరైన వైద్యం అందక ఓ వ్యక్తి మృతి చెందాడని ఆరోపిస్తూ ఓ నర్సింగ్ హోం ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన బుధవారం శివ్వంపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భిక్షపతి ఐదు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న నర్సింగ్ హోంకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించిగా చికిత్స పొందుతూ మూడు రోజుల క్రితం అతడు మృతిచెందాడు. అయితే.. సరైన వైద్యం అందకపోవడంతోనే భిక్షపతి మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు నర్సింగ్‌హోంకు తాళం వేశారు. పోలీసులు ఆందోళన కారులకు నచ్చచెప్పి శాంతింపజేశారు.

టీబీ పట్ల అప్రమత్తంగా ఉండాలి


తునికిలో టీబీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): టీబీ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎన్‌ఎం లక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని తునికిలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రోగులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని చెప్పారు. జాగ్రత్తలు పాటించడం వల్ల టీబీ బారిన పడకుండా ఉంటామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం సంగ్యా తండాలో బుధవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పాపయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సింలు, నాయకులు సక్రునాయక్, రాజేందర్, మోహన్, రూప్లా, బలరాం, దేవిసింగ్, ఇట్యానాయక్ తదితరులు ఉన్నారు.

◆ సీసీ రోడ్లకు రూ.45 లక్షలు మంజూరు

పాపన్నపేట(మెదక్): మెదక్ ఎంపీ రఘునందన్ రావు చొరవతో పాపన్నపేట మండలంలోని తొమ్మిది గ్రామాలకు సీసీ రోడ్లు మంజూరయ్యాయని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బి.సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షులు రాములు తెలిపారు. మండల పరిధిలోని ముద్దాపూర్, అర్కెల, తమ్మా పల్లి, సీతానగర్, అన్నారం, మల్లంపేట, పాతలింగాయపల్లి, నామాపూర్, గాజులగూడెం గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.45 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుంకరి కిష్టయ్య, ఇమానియల్, సాయిబాబ, బాగేష్, చంద్రయ్య, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డుకు రూ 8 లక్షల మంజూరు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎంపీ రఘునందన్‌రావు రూ 8లక్షలు నిధులు మంజూరు చేసినట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేష్ తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిచనున్నట్లు చెప్పారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు ఉపాధ్యాయ పోస్టులకు తాత్కాలిక పద్ధతిన నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి కవిత తెలిపారు. పీజీసీఆర్‌టీ బయోలజికల్ సైన్స్, పీఈసీఆర్‌టీ ఆంగ్లం బోధించేందుకు బీఈడీ, టెట్ అర్హత గల అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 9, 10వ తేదీలలో అభ్యర్థులు పాఠశాల సమయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

◆ పెండింగ్ బిల్లులు అందించాలి

చిన్నశంకరంపేట(మెదక్): మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూలపల్లి యాదగిరి యాదవ్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం కలిశారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను అందించాలని కోరారు. తమ పదవి కాలం ముగిసి 9 నెలలు గడుస్తున్నప్పటికీ బకాయిలు రావడం లేదన్నారు. చొరవ తీసుకుని తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు అందించాలని కోరారు.


◆ బాధిత కుటుంబాలకు పరామర్శ

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్, నస్కల్ గ్రామాలలో బుధవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ మేరకు రాంపూర్ గ్రామానికి చెందిన చేకూరి చంద్రయ్య, సవుడ బాలరాజు కుటుంబాలను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. అనంతరం నస్కల్ గ్రామానికి చెందిన జర్నలిస్టు నర్సాగౌడ్ కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో చింతల స్వామి, అందే కొండల్ రెడ్డి, మహమ్మద్ గౌస్, నగేష్ యాదవ్, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

◆ 11న ఎమ్మార్పీఎస్ రౌండ్‌టేబుల్ సమావేశం

రామాయంపేట(మెదక్): ఈనెల 11న రామాయంపేటలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. సమితి జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరి, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊషన్నగారి మురళి, విజిలెన్స్ కమిటీ సభ్యుడు పాతూరి రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు కిషన్, సాల్మన్, వీహెచ్‌పీ అధ్యక్షుడు సంజీవ్ మాట్లాడారు.

గీతా స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన



తూప్రాన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సబ్జెక్టు ఎగ్జిబిషన్ దోహదపడుతుందని గీతా స్కూల్ చైర్‌పర్సన్ ఉష అన్నారు. బుధవారం స్కూల్‌లో సబ్జెక్టు ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.